# కవితా శారద

కె.టి.యల్. నరసింహాచార్యులు

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# కవితా శారద

(కావ్య ఖండికలు)


రచయిత

కె.టి.యల్. నరసింహాచార్యులు



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2007

**KAVITHA SARADA**
By
**K.T.L. Narasimhacharyulu**

T.T.D. Religious Publications Series No: 694

© All Rights Reserved

T.T.D. First Edition : **2007**

Copies:. 1000

*Published by*
**A.P.V. Narayana Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati-517 507.

DTP by
M/S SAR Infotec (P) Ltd,
15-3-200,G.N.Mada Street,
Tirupati- 517501.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.-517507

# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానములు చేస్తున్న ధార్మిక ప్రచారంలో భాగంగా అందిస్తున్న మరో అక్షర సుమం 'కవితాశారద'. ఇందులో ఇరవైఏడు కవితా ఖండికలు పొందుపరచబడినాయి. అందుకే (నక్షత్రమాలిక) అని కూడా దీనిని పేర్కొనడం ఎంతైనా సబబు.

భారతీయ తాత్త్విక చరిత్ర ఘట్టాలను, వైదిక ధార్మిక ఘట్టాలను, చక్కని కవితా ఖండికలుగా రచించి తెలుగువారికి అందించినశ్రీ కే.టి.యల్. నరసింహాచార్యుల వారికి ధన్యవాదాలు. అందులో మోక్షమూల ఋషి, అశ్రుతర్పణ, ఆత్మవిమర్శ, సూరనార్య కవి-వంటి గేయ ఖండికలు నిజంగా కలకండ పలుకులే అని చెప్పవలసింది. ఈ పొత్తం చిన్నది అయినా శబ్దార్థంలో బహు గొప్పది. దేవస్థానం అందిస్తున్న ఈ ధార్మిక ప్రచురణను పాఠకులు యథాక్రమంగా అందుకొని ఆనందించగలరని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# సింహపీఠి

## (రమణీయార్థప్రతిపాదక శబ్దః కావ్యమ్)

అని పండితరాయల సిద్ధాంతము. నైసర్గిక శక్తి, బహుకావ్య శాస్త్ర ద్యవేక్షణమువలన గలిగిన నైపుణ్యము, అభ్యాసము ననువాని త్రివేణి సంగమమున గవితాతీర్థ రాజము వెలయును.

కావ్యఘటనానుకూల శబ్దార్థోపస్థితి రూప మగు ప్రతిభ యిందు ముఖ్యమయినది. ఇది కొందరిలో నొక్కొక్క వయసునందు బహిర్గత మగుచుండును. నివురు గప్పిన నిప్పువలెనున్న యీ ప్రజ్ఞ యొకొకప్పుడు దేవతానుగ్రహాదులచే బ్రతిబంధకాదులు తొలంగి యుద్గత మగుచుండును. వ్యాసవాల్మీకాదులు ప్రౌఢనిర్భరవయః పరిపాకదశను చేరుకొన్న తర్వాతనే భవ్యకవితా భగీరథులయి యుండుట విజ్ఞులకు విదితచరము గదా!

శ్రీమాన్ కె.టి.ఎల్. నరసింహాచార్యులు గారు చిరకాలము శారదా మాతృసేవలో దమజీవితము పండించుకొనినారు. తమరచనల ప్రచురణ నాపి యితరుల కృతలకే నీరాజనము లొసగి వానికి సూర్యలోక భాగ్యము గల్గించిన సుకృతి యీ సాహితీ సుగతుడు.

ఈయన విద్యాతపస్వి ; కాదుకాదు- "విద్యావిశారదుడు" మధురస నిష్యందములు, సలక్షణగద్యకృతులు అయిన 'లోకమాత' 'అమరజ్యోతి' మొదలగు రచనలు చదివిన తర్వాత వీరియెడ నీ బిరుద మన్వర్థమని నాకు దృఢప్రత్యయము జనించినది. వీరి 'వకుళభూషణ నాయకి' ప్రౌఢగద్యకావ్య మని విజ్ఞుల ప్రశంస లందుకొన్న యుద్గ్రంథము!

బహుశ్రుతులగు వీరిని 'ఉపనిషదుద్యానకోకిల' యనుటతోపాటు 'సాహిత్యోద్యానకోకిల' యనియు ననవచ్చును. శ్రీ గోదా గ్రంథమాల ద్వారా వీరొనర్చిన సారస్వతారాధన యభిజ్ఞులమెప్పును దోచుకొనుట దీనికి

తార్క్యాణము. "ద్వాదశసూరిచరిత్ర" మను గద్యకృతి వీరి యశశ్చంద్రికను చిరస్థాయి గావించి దానిని దెలుగునేల నాలుగుచెఱగుల జల్లగా బ్రసరింప జేయ జాలినట్టిది.

చాలకాలముగా పద్యవిద్యలో సైతము వైశారద్యము గడించిన శ్రీమదాచార్యులవారు 'బ్రాయ మింతకు మిగులఁ గ్రిద్రాలకుండ' తమ జీవితపు టుత్తరార్థమున దాళవాపంటగా 'కవితాశారద' యను నీ లఘుపద్యకృతిని సంతరించినారు. ఇది షోడశాధిక శీర్షికలతో శరద్రాకవలె నొప్పారియున్నది.

ఇక కలకండవంటి యీ కవితాఖండముల నాస్వాదింతము. వేదవిదుఁడయిన మాక్సుముల్లరుతో నాత్మవిదుఁడయిన వివేకానందుని సమావేశము 'మోక్షమూలఋషి' యను ఖండికయందు వర్ణితము. "అశ్రుతర్పణ" మనునది సుప్రసిద్ధ దేశభక్తుడు ఆంధ్రమాత ముద్దుబిడ్డడు అగు శ్రీ కాకాని వేంకటరత్నముగారి కోసంగిన పద్యతర్పణము.

"స్వార్థ రాక్షసు వెదకంగ సాయపడుము,
వాని జంపంగ నీనాఁడు పూనుకొంటి,
స్వాగతమ్ము దీపావళి! సాగి రమ్ము"

అని పలుకుటలో "స్వాగతమ్ము దీపావళి" యను ఖండిక యందొక నవత సాగివచ్చినది. "కళాపూర్ణోదయము" నపూర్వముగా వెలయించిన పింగళసూరన మహాకవి మేధాశక్తికి "సూరనార్యమహాకవి" యను ఖండికయందు వందన మర్పింపబడినది. సుఖదుఃఖములకు బొంగక క్రుంగక "స శాన్తి మాప్నోతి న కామకామీ" అనునట్లుండు వాడే "పరమయోగి" యని యొకచో వివరించిరి. "ఆత్మ విమర్శ" యుత్తమ కవితాఖండము. 'ద్వాదశసూరిచరిత్ర' వంటి ప్రశస్తగ్రంథమును రచించియు "నేను నిమిత్తమాత్రుడను నిచ్చలు"...... అని భగవంతునికి విన్నవించుకొన్న నిర్లిప్తుడీ కవి.

సదధ్యాపకులయిన శ్రీ మదాచార్య సుధీమణి సమకూర్చి తెలుగు బిడ్డలకై యుడుగరగా నొసంగిన సూ క్తిసుధ "తెలుగుబిడ్డ." ఇందు ఇరువదియేడు పద్యరత్నములున్నవి. కావున దీనిని 'నక్షత్రమాలిక' యను కావ్యభేదముగా బరిగణింపవచ్చును. "ఆచార్యః పూర్వరూపమ్, అన్తేవా స్యుత్తరరూపమ్, విద్యా సన్ధిః, ప్రవచనగ్ం సన్ధానమ్" అను నుపనిషద్వాణిని ధ్రువతారగా దృష్టి నిడికొని యీ సువర్ణవాహిని తెలుగు తీరుతీయము లొలుకబోయుచు ముందుకు సాగినది. శతకశాఖకు ముఖ్య లక్షణమగు మకుటము "తెలుగుబిడ్డ"ను చతుర్థపాదాది నీకవి నిబద్ధించుట గమనార్హము! "నిరంకుశాః కవయః" గదా!

"విద్యవలన పదవివేకము గల్గును." "తెలుగు భాష మిగుల తీయనిదౌ భాష" "తెలుగు బిడ్డ! పలుకు పలుకు గనుము" మున్నగు చక్కని మీగడతరక లిందెన్నో కలవు. ఈ శీర్షికయే అక్షరలక్షలు చేయునన నిందలి సూక్తి రత్నముల మాట వేరుగ వ్రాయనేల!

"శ్రీనరసింహస్తుతి" యను ఖండిక యొక విధముగా కవియొక్క యాత్మనివేదన మననగును.

*"అనాయత ప్రాణ మసంయతాక్ష*
*మ బ్రహ్మచర్యానశనాది ఖేదమ్।*
*చిత్తం మహేశే నిభృతం విధాతుం*
*సిద్ధః కవీనాం కవితైవ యోగః"*

అని నీలకంఠ దీక్షితులనినట్లు సౌజన్యమూర్తి యయిన యీ కవి కవితాయోగముతో శ్రీమన్నారాయణస్వామి కటాక్షమును పొందగలిగినాడు. 'శ్రీ నరసింహస్తుతి' యం దిది వెల్లడి యగును.

*"ఏవేవో కలలంద గాంచితిని గానీ వాఘు కావ్యేందిరా*
*సేవం జేయగలాడ నంచు మదిలో జింతింపలేనైతి; త్వ*
*ద్భావాధీనకటాక్ష మిట్టిదని నేభావింతు సారస్వత*
*శ్రీవాత్సల్యము జెందినాడ నిను సేవించి నారాయణా!"*

అను రచయితవక్కణ దీనికి తార్కాణ. "నీవు దయాసముద్రుడవు నిన్గనుగొంటి నఘుంబుదూలె....." మొదలగు పద్యములు వీరి కవితాశైలి కుదాహరణములు.

కావ్యారంభమున శారదాదేవికి ఉపద యొసగబడినది. ఈ కృతిని "కవితా శారదా" యని గోదాపదారాధకుడయిన యీకవి పేర్కొనుట యెంతయు సముచితము. "గోదా" పదమునందు వాక్కుల నిచ్చునది అనియు నర్థము గలదు. కృతికర్త మాతృదేవి పేరు అండాళమ్మ – అనగా గోదాదేవియే. కావున నీకవియెడదలో తమ మాతృమూర్తికి – గోదాదేవికి – శారదదేవికి – ఈ దేవీ త్రయమునకు అభేదాధ్యవసాయము సిద్ధించినది.

*"అలతి యలతి పలుకు లందముగా గూర్చ*
*దేట తెలుగులోన దేనెతాలు*
*వారు దివ్యభవ్య వాక్సుమమాల నే*
*వారు దాల్చ రట్టి సారకృతిని".*

"వాక్సుమమాల నేవారు దాల్చరు," అని నపుడు శ్రీరంగనాథునకు మాల్య మిచ్చు నప్పిన్నది – గోదాదేవియే యీ కవి సరసహృదయమున సొగసుగ కదలాడినది. ఇంతేగాదు – దీనితోబాటు – ఈ కవిత యొకటి మాత్రమే సారకృతికాదు – తాను కూడ సారకృతినే యని – శ్లేషభంగిలో నిపుణముగా చెప్పకయే తమ్ముగూర్చి తాము చెప్పుకొనిన వారై నారు వీరు.

ఈ ఖండికలో సుకవితాలక్షణములు మృదువుగా జొప్పించి వదలినారనుట తెల్లమే గదా: తమకవితయునిట్టిదే యని వీరు భంగ్యంతరముగా సూచించిరన్న విప్రతిపత్తి యుండదు.

రాశిలో చిన్నదయ్యును అనల్పశిల్పరమణీయమైన యీ 'కవితాశారద' వాసిలో దొడ్డదే! ధ్వనిప్రధాన మయిన యీ కావ్యఖండికలో వెదకినచో వ్యంగ్యార్థములకు గొదువయుండబోదు. సహృదయులు నిపుణముగా పరిశీలించిన కొలదియు ననర్ఘసూక్తిరత్నదీధితు లిందు సమృద్ధిగా గోచరించును.

భగవదనుగ్రహముచే శ్రీమాన్ నరసింహాచార్యులవారు సంపూర్ణాయురారోగ్య భాగ్యములనంది యితోధిక గ్రంథరచనా ప్రకాశనములచే తమ సారస్వత సేవైకదీక్షను నిరంతరాయముగా కొనసాగించి తెలుగుతల్లి కలలను పండించి తరింతురు గాక!

పరాశరం గోపాలకృష్ణమూర్తి

# కవితా శారద

## ధ్యానము

లావణ్యసీమయై తా
నేవాఙ్మాలికలతోడ నీరజనేత్రున్
వేవిధముల నలరించెనొ
యా వాగీశ్వరినిఁ దలఁతు నతిభక్తి సదా!

అతిమృదువైన సత్కవిత
        లల్లఁగ నేర్పిన కీరవాణి,
సంతతశుభశీలయై
        జననుతం బగు విద్యల సార మిచ్చి
విస్తృతహృదయావబోధ
        గుణవృద్ధులఁ బ్రోచెడి శారదాంబ,
యానతజనకల్పవల్లి యగు
        నాజననీమణిఁ బ్రస్తుతించెదన్.

ఈ సురూపంబు భావన మెపుడు సేతు
నితర మేనొల్లనమ్మ, నీసుతుని నమ్మ
కాని యీబుద్ధి స్థిరముగా వీని కిచ్చి
యెట్లు రక్షణ సేతువో యేమొ నీవు!

ఏనుకోరిన దీయకు మీవు – అసలు
కోర్కెనే చంపివేయుము – కూర్మి మీర
నాకు హితమైన దిచ్చుచు సాకుమమ్మ
తల్లి నడపింపుమా నన్నుఁ దనయుఁడఁ గద!

## ఉపద

చేతఁ బొత్తము పట్టించి, చిద్విలాస
దీధితుల నెంతో తీరిచి దిద్ది ప్రీతి
నన్నుఁ బలికించుచున్న యా నలువరాణి
సరససంగీతసాహితీ చారుమూర్తి
కంకితము సేయువాఁడ, నా యాదికవిత !

వచనంబందు గడించితిన్ ఘనత నేఁ
బద్యంబులం గూర్పఁగా
సుచరిత్రుల్ మహనీయమిత్రు లిదియున్
శోభావహం బంచు నన్
వచియింపం గని గాంగని ర్ఝరసదృ
గ్వాగ్ధాటితో నిట్లిదో
రచియింతున్ గృతి–వాణి ! గైకొనగదే
రాజద్గుణాంభోనిధీ!

## అభివాదయేం!

శ్రీ మద్గురువరకరుణా
కామిత మిదె యందఁగంటిఁ గవితను గంటిన్,
నే మనమున భావించెద
శ్రీమన్నారాయణుని భజించెద భక్తిన్.

శ్రీ జగన్నాథ దేశికుఁడు మజ్జనకుండు
అతండె బ్రహ్మవిద్యాప్రదాత
సద్వినుత చరిత్ర సాధ్వి యాండాళమ్మ
ననుఁ గని పెంచి పెద్దనుగఁ జేసె,

త్యాగియౌ వేంకట తాత సుధీమణి
వ్యాకరణము నేర్పె బావగారు,
హారీతగోత్రుండ యాజుషశాఖలో
వరలితి బ్రాహ్మికిఁ బరమహితుఁడ;

వాణి నావాణిగా నిట్లు ప్రకట మగుచు
బాణి గైకొని లిఖియించె భవ్యశైలి
విష్ణు భక్తుల చరితంబు విశదమతిని
నారసింహుండ విద్యావిశారదుండ.

అ, ఇ, ఉ, ణ్ణుతో నక్షరాభ్యాసమును జేసి
యమరంబు నేర్పె నాయనుఁగుఁదండ్రి
బమ్మెరపోతన భాగవతమ్మును
బఠియించినాఁడను బాల్యమందె
పాణినీయంబుతోపాటుగా నేర్పె రా
బాషలో మర్మముల్ బావగారె
గ్రంథబంధనరూపకళ నేర్చినాఁడను
కరతలామలకంబు కావ్యరచన

సంతతాధ్యాపనంబు నా సహజవృత్తి
తమిళవంగోత్కళాదులు నమరియుండు
సరవి సాహిత్యరత్న భాషాప్రవీణ
పట్టములఁ గొంటి సుకవుల ప్రాపుగంటి.

విద్యావిశ్రుత ముపనిష
దుద్యానపుఁ గోకిల మ్మిదో మధురముగాఁ

బద్యము లాలిపించును
సద్యఃపరనిర్వృతిఁ గను సరసులు వినుఁడీ!

పద్యంబును గద్యంబును
హృద్యంబుగఁ జెప్పగల యహీనప్రతిభా
విద్యావినోది నగుదును
సద్యఃస్ఫురణను వెలుంగు సత్కవిసఖుడన్.

పద్యరచనలో నాయన
పద్యంబగు నైపుణ్యమును వాగ్గుంఫనమున్
హృద్యంబగు ప్రాక్తనకవి
పద్యానుసరణము గనుఁడు భావుకులారా!

ఏవేవో కలలంద గాంచితిని గానీ చారుకావ్యేందిరా
సేవం జేయఁగలాఁడ నంచు మదిలోఁ జింతింపలేనైతిఁ, ద్వ
ద్భావాధీనకటాక్ష మిట్టిదిగనీ భావింతు సారస్వత
శ్రీవాత్సల్యము జెందినాఁడ నిను సంసేవించి నారాయణా!

## భక్తి ప్రణతి

మంత్రమంత్రార్థముల్ మమతతోఁ బఠియించు,
భగవద్విషయవీథిఁ బర్యటించు,
శ్రీహరికైంకర్య చింతనాశీలయ్యె
సమయంబు గడపుచు సాగుచుండు,

మాపితల్ నిర్మింప మహిమఁ బెంపెసలారు
దేవాలయంబును తీర్చిదిద్దు,
రాజ్యలక్ష్మి యుక్తిరహిమించి శ్రీమించు
నారాయణుని గొల్చు ననవరతము,

నాకు సోదరియై నన్ను సాకుచుండు
నట్టి లక్ష్మీ నరసమాంబ యధికభక్తి
భాగవత ముఖోల్లాసమే బ్రతుకుగాగ
జీవితము సాగనిచ్చును చింతవీడి.

భగవత్పరిచర్యాపర
యగణిత సద్గుణవిభూషితాత్మను లక్ష్మిన్
భగవతిగా సేవించెడు
భగినిని సేవించి భక్తిఁ బ్రణుతింతు సదా!

## కవితా శారదా

శారదనీరదరుచి యై
పారదసమప్రజ్ఞ నిచ్చి పరిషత్తులలోఁ
గేరి గెలిపించు కవితా
శారదనేఁ గొలువఁ జిత్తశాంతికిఁ గొదువే!

అలఁతి యలఁతి పలుకు లందముగాఁ గూర్చఁ
దేట తెలుఁగులోనఁ దేనె జాలు
వారు దివ్యభవ్య వాక్సుమమాల నే
వారు దాల్పరట్టి సారకృతిని!

తెలుఁగునఁ గవితను జెప్పఁగ
నలవియె కడునేర్పు నోర్పు నలవడకున్నన్,
ఇలఁ బ్రాసయతిగణంబుల
నలవోకగ బంతులాడునతఁడె వలఁతియొౌ.

వనితయుఁ గవితయు ధనమును
దనయంతన వచ్చినపుడె ధన్యుఁడు పురుషుం
డనఁజను నటుగాకుండిన
మనుజుఁడు దుఃఖార్తుఁ డగును మదిలోఁ దలపన్.

మనసున కింపున గొల్పును
నెనరుంచి రచింప సురుచి నీతియు గూర్చున్
విన విందగు, సత్కవితా
ధనమును బోలిన మరొండు ధన మేది భువిన్ ?

పలుకు పలుకునఁ గలకండపలుకు లొలుక
మాటిమాటికి సామెతల్ మీటి ప్రౌఢి
గద్య పద్యము లల్లుచు గరిమ లలిత
మధుర భావముల్ వెలయించి మంజుశైలిఁ
గవిత సెప్పంగలాఁడె సూ కవివరుండు!

# శ్రీ నరసింహ స్తుతి

నీదు సుధామయోక్తులను నేఁదమితోడఁ బఠింపగాని స
మ్మోదము నంది నా హృదయమున్ గవితాలయమయ్యె-ధీరతో
త్పాదకమై భవత్కవిత దాశరథీ*, పురిగొల్పు చుండ నే
తాదృశరీతి నాదు కవితాలతకుం దొలిమొగ్గ పూచెడున్.

తాను ధరించినట్టి సుమదామములన్ హరికిచ్చి ప్రేమ నా
దానవసూదనుం గొలిచి తత్ప్రతియై తగువిష్ణు చిత్తజన్
మానుగ సంస్మరించెదము మా హృదయాబ్జమునం దనర్చుచున్
ఈ నవకావ్యదామమున కింపగు వాక్కుసుమంబు లీయగన్.

జననం బందినదాది నేటివరకున్ సల్పంగ లేనైతి నో
వనజాతేక్షణ! భక్తి నీపయిన నవ్యంబైన నావాక్ప్రసూ
ననికాయంబులఁ గూర్చి నీకిడెద నానందంబు నేనందఁగా!
ననుమానింపక వీనిఁ గైకొని ముదం బందంగదే శ్రీహరీ!

అరిషడ్వర్గముఁ బారద్రోలి మదియం దాస్థన్ వెసన్ ద్రోచి యో
పరమేశా, నను బ్రోవుమా కరుణతోఁ బారంబునన్ జేర్చుమా;
భరమున్ నీపయి నిల్పినాఁడ నిఁక త్వత్పాదప్రభం జూపి నా
కర మింపారఁగఁ బట్టి నన్ నడపుమా కంజాక్ష, నారాయణా.

ధనధాన్యంబుల నంది నీకరుణచే ధన్యాత్ముడైనాఁడ నో
వనజాక్షా! సుతసంపద న్మిగులఁగా వర్ధిల్లఁగాఁ జేసి నా
మనమున్ నీ దెస నిల్ప త్రిప్పుకొనగా మచ్చేదియో చల్లితే
మనిదంపూర్వము కైత నిప్పుడిటు లీవందంబుగా నిచ్చుటల్.

---

* ప్రసిద్ధ కవి శ్రీదాశరథి కృష్ణమాచార్యులు

అనుభవ మంది తీ యిహమునం దమితంబగు సౌఖ్యసంపదన్
అనుదినబాధలం బడితి నైనను బుద్ధియె నాకులేదయో
వనరుహనాభ, నాదుభవపాశములన్ విడఁదీసి నీపయిన్
అనుపమభక్తి నాకిడుచు నాశ్రితుఁ బ్రోవుము నన్ను శ్రీపతీ.

అపశబ్దంబులఁ గూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపా
పపరిధ్వంసముచేయు నంచు విబుధుల్ పల్కంగ నే విందు-నీ
యపశబ్దంబులు లేక నిన్ బొగడ సాధ్యంబౌనె నాకైన నీ
కృప గాంక్షించి యిటుల్ గడంగితిని స్వామి సైపు నారాయణా.

నరసింహస్తుతి సేయు కావ్యము సువర్ణశ్లాఘ్యపద్యంబులన్
సరసంబౌ కలకూజితంబు గల హంసశ్రేణులం గల్గి యా
యరుదౌ మానసశోభ నింపెసఁగు నాయబ్జాక్షు సంకీర్తనం
బెరగా నొప్పని కావ్య మీయిలను దానేరీతి శ్లాఘ్యం బగున్?

పునరుక్తుల్ కడుఁ గల్గెఁ దీనను గనన్ భోగ్యంబుగా దందుచే
త ననఁబోకుమ శ్రీపతీ! మురహరా, త్వత్సన్నిధిం జేర నీ
పునరుక్తుల్ గడుఁ గార్యసాధకములై పొల్పొందునం చీవిధిన్
దనరం జేసితిఁ బ్రేమతోడఁ గొను మిద్దానిన్ గృపావారిధీ!

రతనముగూడ సానపయి రాపిడి పెట్టిననే వెలుంగు నీ
యతుల పదాబ్జభక్తిని హృదబ్జమునందు స్థిరంబుగా నిడన్
మతిగుణహీనుఁడైన నను మందుని బాధల పాలు జేసి నా
నతులను బొంది ప్రోవుమ ఘనాఘన నీలశరీర, శ్రీవరా!

పట్టినపట్టు వీడకయె పంతముతోడుతఁగొన్ని విద్యలన్
పట్టము గట్టి తీపె ననుఁ బాఱఁగ జూడఁగనద్ది గొప్పయా?
పట్టగ నీ పదాబ్జముల వచ్చితి నిప్పుడు దానవారి, యి
ప్పట్టున గట్టి పట్టుదల పై నను సాగనిమ్ము శ్రీపతీ!

పట్టినదెల్ల బంగరుగ వచ్చుచుమండెను కొన్ని వేళలన్
చెట్టను బట్ట నీ దుపద సేవను నే నిపు డించుచుంటి నా
పట్టుము నిప్పు డీవు దయ పాయక సాగఁగ నిచ్చి నాపయిన్
గట్టిగఁ బెట్టు నీకృపను ఖండితదానవనాథ శ్రీహరీ!

అతుకులబొంత దేహ మిది, యారయ దోషపుఁబుంత యెంతగా,
వెతకిన రంధ్రజాలములె వింత యొకింతయు లేదు; కాన నీ
వితరము సుంతయుం గనకు మేర్పడఁగా విను-వంత వాయ నీ
పతి దృఢ మైన చింత మనసా, హరిపాదము లాశ్రయింపుమా!

జనని శుభాశిషంబు లిడె స్వామిపయి న్నుతి వ్రాయు మంచుఁ గా
నని యిది యప్రయత్నముగ నామది నీ వెటు దోచితో యటే
నిను నుతిఁ జేయు వ్రాసితిని నేఁదలిదండ్రియుఁ జాల మెచ్చగన్
విని యిఁక సంతసంపడుము విశ్వపతీ మధుసూదనాంతకా!

నీవు దయాసముద్రుఁడవు, నిన్గనుఁగొంటి నఘంబు దూలె, నీ
చే వర మంది సత్కవిత సేతును, నీకొఱకై నమస్కృతుల్,
నీవలన్ బ్రభావితుఁడ, నీకు సమర్పణ సేతు సర్వ, మో
శ్రీవర, త్వత్స్వరూపమునఁ జిత్తము హత్తెను, కావు మాధవా!

# *కవి కోకిలము

వేముగంటి నరసింహ కోకిలం
భావయామి సతతం హృదంబుజే
య శ్శుకార మమ గ్రంథ పీఠికాం
కావ్యశిల్పరస వీక్షణాత్మికాం.

ఎక్కడి సిద్ధిపేట యిట కెట్లరుదెంచితినంచు నెంతొ నే
నక్కజ మందుచుంటి, నహహా! భగవంతుఁడు చేయఁబూనినన్
దక్కని దేమి మానిసికి! ధారుణియందున మాన్యులార, నే
మిక్కిలి ధన్యతం బడసి మేల్గనినాఁడను నేడు మీదయన్.

సిద్ధిపురిని గంటి, సిద్ధుల నేఁగంటి,
గంటి రసాబ్ధిని, గంటిఁ గళలఁ,
గంటి మిత్రులఁ, నటఁ గంటి శ్రీరాములఁ,
గంటి శ్రీరాజయ్యఁ, గంటిఁ గృష్ణుఁ,

గంటి నాతిథ్యంబు,గరిమను గంటిని,
గంటి గవీంద్రులఁ, గంటి బుధుల,
గంటిని గురుభక్తిఁ, గంటిని విద్యలఁ,
గంటి పావిత్ర్యముఁ, గంటి బోధ,

---

* కవికోకిల శ్రీమదాచార్య వేముగంటి (వేముగంటి నరసింహాచార్యుల వారు, సిద్ధిపేట) ద్వాదశసూరిచరిత్ర కావ్యావిష్కరణ సందర్భమున ఏతద్రచయిత కృతజ్ఞతా నిర్భరుడై సమర్పించుకొన్న కవితారత్నమాల-

నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృత పానంబుచేత మత్తు
ఘనుని వేముగంటిని బొడఁగంటి, ముదము
గంటి, సన్మాన మిదె, యందఁ గంటి యశము!

పానుగంటి మీద పద్యముల్ పలికితి
వేముగంటిసుకవి! వింత రీతి
వేములోనఁ గంటి మేము తియ్యదనంబు
ఎంత యద్భుత మిది యెంచి చూడ!

తేనెసోన లూర వీనుల విందైన
తెలుఁగుఁ గైత మిమ్ము వలచి వచ్చి
క్రొత్త చెలువము సమకూర్చుకొన్నది, మీరు
ధన్యజీవనులు యథార్థముగను.

సాహితీ వికాససంస్థను స్థాపించి
సాధురీతి నాంధ్రశారదాంబ
మిగులఁ బూజచేసి మేల్మి వహించిన
వేముగంటిఁ దెలతు వేడ్కమీర.

సతత కావ్యరసాస్వాద సక్తహృదయు
విమలచరితుని ధీశాలి నమల కీర్తి
సరససాహితీమాధురీ సారమూర్తి
వేముగంటిని వినుతింతు వేవిధముల.

నవనవశోభావహ మగు
నవితథవాక్కులను వాణి నర్చించెడు నీ
వవిరళయశస్సు నందుచుఁ
గవికోకిల, నెగడు మెల్లకాల మ్మిలపైఁ.

ఈ కావ్యావిష్కరణము
వే కావించుటయె కాక వింతవు రీతిన్
నాకానందము గూర్చిన
యీ కవికుంజరున కిడుదు నెన్నేని నతుల్!

## *అశ్రుతర్పణము

ఆంధ్రదేశమ్మున నధ్యాపకుల కెల్లఁ
దలలోని నాల్కయై మెలఁగె నెవఁడు
రైతుసోదరులకు రక్తమునే పంచి
యిచ్చి దేశమ్మెల్ల మెచ్చ నెవడు,
మంత్రియై వ్యవసాయ మాదియౌ శాఖల
నేర్పుతో నెవ్వడు నిర్వహించెఁ,
గాకాని వంశంబు శోకానముంచిన
మానవతాజ్యోతి మహి నెవండు,

ప్రజలక్షేమమ్మునకె వీడె ప్రాణములను
లక్షలాదిగ జనులకు శిక్ష వేసి
కవులఁ బోషించువాఁడట్టి కర్మవీర
ఘనుఁడు వేంకటరత్నము కానరాఁడు!

*ఆంధ్రమాత సుపుత్రుడు వీరకాకాని శ్రీ వేంకటరత్నము గారి నిర్యాణసమయమున రచితము.

ఈ మహామహు దయచేత నిట్టి గడిచి
పోయెఁ బాతిక వర్షముల్ పూజ్యరీతిఁ;
బండితోద్యోగ మిచ్చి కాపాడె సాధు
వరుఁడు కాకాని సత్కీర్తి పరిఢవిల్ల.

ముష్కరులు పసిబిడ్డల ముట్టడించి
పెట్టుబాధల నిఁక చెవిఁ బెట్టలేక
గుండెపోటుతోఁ గూలెను కోటివీర
సింహముల కుద్ది కాకాని చిత్రముగను.

వీరకాకాని యాంధ్రమ్ము వేరు చేయ
నట్టి దీక్షను చేపట్టె ; నిట్టె ప్రాణ
ములనె బలి యిచ్చె మిగుల నపూర్వరీతి
నాంధ్రవిభజననేతయే యస్తమించె.

కాని యిఁక వగవఁగ రాదు కక్ష వదలి
పట్టుదల నొఁదల ధరించి ప్రజ్ఞసూపి
ఆ మహావీరులక్ష్యమ్ము నమిత దీక్ష
పూని సాధించెదము గాక భూరిజయము!

## స్వాగతమ్ము దీపావళి

చంద్రమండలయాత్రకై సాగిపోవు
మానవుం డేల గెలువంగఁ బూనుకొనఁడు
అంతరంగంబు; అది చేయ నబ్బుగాదె
సర్వసమతయు నింద్రియజయము శాంతి.

బైటి చీకటి పోకార్ప భవ్యదీప
తతిని వెలిగించుచున్నాము, వెత నడంప
గలుగు లోపలి దీపమ్ము మలపినాము,
ఇద్ది యేన్యాయమో యేమొ యెఱుఁగ లేము.

ఇంటి దొంగను పట్టలేఁ డీశ్వరుండు
సైత మనియెడు సామెత సార్థకంబు
సలుపుచున్నాము మన మిప్డు జంకువీడి
యిట్టిదా? నేటి సంస్కృతి యెంచి కనుఁడు.

ఎంతమందియొ ప్రజఁగావ నీభువి నవ
తార మెత్తి బోధించి తరింపఁజేయ
గోరి పాటులఁ బడి ; రైన కుక్కతోక
వంకరను దీర్ప నేవారు వాసి గనిరి?

గతమునకు వగవఁగ నేల గతము గతమె
స్వార్థరాక్షసు పెదుకంగ సాయపడుము
వానిఁ జంపఁగ నీనాడు పూనుకొంటి
స్వాగతమ్ము దీపావళి సాగిరమ్ము.

## మోక్షమూల ఋషి

ప్రాచ్యవిద్యల గురు వయి పరిఢవిల్లు
మాక్సుముల్ల రాధ్యాత్మిక మహిమ వెలసె
రామకృష్ణుని శిష్యుడై రాణ మెఱసి
యతని మతమును చాటె నాయతి జగమున
వేదభాష్యము వ్రాసె నావేదవిదుఁడు.

అట్టి యామహామహు జేరనరిగె విశ్వ
పర్యటనమును జేయుచు బ్రహ్మవేత్త
శ్రీనరేంద్రుండు సర్వదిగ్గీత యగుచు;
ముల్ల రా వివేకానందుమూర్తిఁ గాంచఁ
జాల వేడుక పడి పిల్చి స్వగృహమునకు
భోజ్యవస్తువు లిడి యెంతొ పూజసేసె.

అతని యాతిథ్య సంపద కలరి యనియె
శ్రీ నరేంద్రుడు-దేవ, నాచిత్త మెంతొ
తృప్తి గనియెను దీన-నో ఋషవరేణ్య,
మన గురువు రామకృష్ణుని మహిమలు గన
నేగుదెమ్ము భారతమున కిపుడె నీవు.

గురునిఁ గాంచిన యప్డె నాగుండె వ్రీలి
పోవు టెంతయుఁ దథ్యము పూజనీయ
అంత యానందము భరింపనగునె నా క
టంచుఁ బలికె నాఋషియును నతనితోడ.

అంత నది విని పెలఁగంది యాదరమున
శ్రీ నరేంద్రుండు హర్షమ్ము చెంది ప్రీతి
గాఢబాహుపాశమ్మునఁ గట్టి యతని
గారవించి పూజించెను ఘనత మీర.

మాక్సుముల్లరు భారతమాత కెట్టి
యనుఁగుబిడ్డయై మించెనొ యద్ది విన్న
ప్రజలు హర్ష నిర్భరులయి పరవశింత్రు
త్యాగి యా మోక్షమూలర్షి, ధన్యుఁడతఁడె!

## సూరనార్య మహాకవి

అల కళాపూర్ణ కథ నెంతొ యబ్బురముగ
నవరసాకృతి సుందరనవల యనగ
సృష్టి చేసిన నీ మేధచిద్విలాస
మెట్టి దని చెప్పనొప్పు నీ మేటి సుకవి!

నవలల వన్నెలు చిన్నెలు
నవల న్నాటకపురీతు లాహ్లాదముగా
నవలంబించి రచించితి
నవలాలిత్యంబు మీఱ నవరసరసికా!

ఆంధ్రకావ్యంబు లన్నింటి నతిశయించి
మా మనస్సును హరియించె మహితశైలి
నీదు కావ్యంబు రస మతినిర్మలమ్ము
అందు పాత్రలశిల్పంబు నద్భుతంబు.

షేక్స్పియర్ కవి వర్ణించె చిత్రగతిని
*కవలల వినోదనాటకగాథ దాని
గూడ మించితి వయ్యారె గూఢవస్తు
విన్యసనపద్ధతిని సూక్ష్మవీక్షణమున.

కలభాషిణి కలగానము
నలకూబరుఁ గూడఁ జేయు నటనంబున్

---

*కామెడీ ఆఫ్ ఎరర్స్.

యలు పన్నుటయును మాహృది
వెలలవు మఱి దలపఁ దలప వేడుకె పుట్టున్.

అల సుగాత్రిచరిత మంద మౌనట్లుగా
మలచినావు నీవు-మరచినాము
మేను లేమది విని మివులంగ మెచ్చితి
మయ్య సుకృతి, నిన్ను మాన్యవర్య.

తెలుగులో మాత్రమే గాదు వెలుగుచున్న
విశ్వభాషలలో గూడ వింతయైన
యిట్టి కావ్యంబు లేదని యెల్లవారు
భావుకత్వంబు మీఱగాఁ బలికినారు.

ఎన్ని మారులు చదివిన నింత యేని
దుష్టిఁ గనఁజాలరు గదయ్య శిష్టవరులు
ఇట్టి నీ కిదె వందనం బిద్ధశిల్పి
సూరనార్య మహాకవి, సూరివినుత!

## ఆత్మ విమర్శ

ఏ నొకపాపి మూఢమతి
నిట్టి యను త్తమయోగివర్యులన్
గానము చేసినాఁడ ననగా
నది నీదయ కాదె-రామ,
సన్మానము చేసినారు నను
మాన్యులు సత్కృతికర్తనం, చిటన్

నేను నిమి త్తమాత్రుఁడను
నిచ్చలు నిన్ శరణంటి కావుమీ.

ద్వాదశసూరివర్యుల కథన్
రచియించుట యన్న మాటలే!
వేదమయుండు శాశ్వతుఁడు
విష్ణుఁడు నన్ గరుణింప హేలగా
నీఁదితి నీఁసముద్రము
సమిద్ధయశంబును గంటి నింక వే
నాదగు మోహజాలమును
నాశము చేయుము జానకీపతీ

ఈ నరజన్మ యెత్తు టది
యెంతయు దుర్లభ మందునున్ బరా
ధీనమనస్కతన్ బరవిధేయత
మాని ముకుంద నామమున్
పానము చేసి పాడుచును
భక్షణచేయుచు నుండు మన్కి సు
జ్ఞానికి లభ్య మేను నటు
సాధన చేయఁగఁ బూను టెన్నడో

## పరమ యోగి

సుఖము ప్రాప్తింపఁగా సొక్కి సోలెడు నరుఁ
డుప్పొంగిపోవుఁ దా నూర్ధ్వదిశకు

నేమి జన్మం బిది యేమి జీవిత మిది
యెంత యద్భుత మని యెగసిపడును
కష్టముల్ ప్రాప్తింపగా నాతఁడే క్రుంగు
నగ్నిలోఁ బడఁబోవు నాతనివలె
నేమి జన్మం బిది యేమి జీవిత మిది
యెంత నిష్ఠుర మని వంతఁ గుందుఁ

గష్టసుఖములు పడుగు పేకలుగ నల్లి
చిత్రపటమును దాల్చు విశిష్టసృష్టి
భ్రాంతి వీడెడువాఁడె పో పరమయోగి
శాంతి నందును వాఁడె నిస్సంశయంబు!

## *తెలుగు బిడ్డ

కృష్ణకరుణఁ బుట్టి యిలమీదఁ బెరిగితి
మీశుకరుణ మనకు నెపడు వలయు
కాన నతని దయను కాంక్ష సేయుము నీవు
తెలుగుబిడ్డ జ్ఞానతృష్ణ గనుము.

విద్యవలన పదవివేకము గల్గును
విద్య వినయ మిచ్చు విజయ మిచ్చు
విద్యలేనివాడు వింతయౌ పశు వగు
తెలుగుబిడ్డ నేర్వు తెలుగు విద్య.

---

*ఈ శీర్షికలో వ్యాకరణ నియమము లెక్కుడుగా పాటింపబడలేదు.

పలుకులోన గలవు భావము లన్నియు
పలుకులోన గలదు బ్రహ్మవాక్కు
పలుకులోన గలదు బ్రహ్మాండ మంతయు
తెలుగుబిడ్డ పలుకు పలుకు గనుము.

సత్యవాక్కు పలుక శపథంబు పూనుము
ధర్మమునకె తనువు ధార పోయు
మైకమత్యమునకె యఖిలంబు నర్పింపు
తెలుగుబిడ్డ నేర్వు దిట్టతనము.

తెలుగు భాషమిగుల తీయనిదౌ భాష
తెలివి గలుగువాడు తెలుగు వాడు
దేశ భాషలందు తెలుగు లెస్సగు గాన
తెలుగుబిడ్డ చదువు తెలుగు భాష.

జనని భాషల కిల సంస్కృత భాషయె
సంస్కృతంబు లేక చదువు లేదు
సంస్కృతంబు చదివి సరసత గనుమోయి
తెలుగుబిడ్డ తెలియు తెలుగు వాణి.

సంఘసేవ నీవు చక్కగా చేయుము
కష్టపడెడువారి కరుణ జూడు
విద్యరాని ప్రజకు విద్యను నేర్పుము
తెలుగుబిడ్డ ప్రజకు వెలుగు నిమ్ము.

హింస మానుకొని యహింస చేపట్టు
దైవభక్తి కలిగి తనరుచుండు
బీదవారి దేవు బిడ్డలుగా జూడు
తెలుగుబిడ్డ దొడ్డ వెలుగుగడ్డ.

ఆశ పాశము బోలునట్టి దాయాశను
పొందుట యన *ఆశ పొందుటె యగు
కాన దాని వదలి ఘనకీర్తి నందుము
తెలుగుబిడ్డ యధికతృష్ణ విడుము.

తల్లిదండ్రు లయెడ దయ చూపమానకు
తల్లిదండ్రులరయ దైవసములు
తల్లిదండ్రు లిలను ధనధాన్యములు సుమీ
తెలుగుబిడ్డ దీని తెలిసికొనుము.

కన్నతల్లి నెపుడు గౌరవమ్మున జూడు
తల్లి ప్రేమ లేక ధరణి లేదు
తల్లిని పూజింప ధర్మముల్ నిలచును
తెలుగుబిడ్డ తెలియు దివ్యజనని.

అమర ద్వాదశాత్ముడై సూర్యరూపుడై
లోక బాంధవు డయి నాకమందు
వెలుగుచుండు నట్టి వేవెలుంగును భక్తి
తెలుగుబిడ్డ నీవు కొలువుమయ్య.

* దిక్కు.

దయను చూపు భూతతతియెడ నీవెప్డు
సహృదయు డన దయను సలుపువాడె
దయ వదలినవాడు ధార్మికు డెట్లగు
తెలుగుబిడ్డ దీని దెలియవయ్య.

కష్టసుఖము లనగ కావడికుండలు
గాగ నెరిగి నీవు సాగుమోయి
ద్వంద్వమయము గాగ తలపు మీజగమును
తెలుగుబిడ్డ దీని వెలుగు నెరుగు.

శీలమె జనుల కిల చింతను పోకార్చు
శీలమె మనుజాల చేటడంచు
శీలమహిమ దెలసి చిద్విలాసము గను
తెలుగుబిడ్డ మేరుధీర వినుము.

కష్టపడిన ఫలము గాంచును ప్రతివాడు
కృషిని చేయువాడు ఋషియును నగు
కృషిని చేసి నీవు కీర్తినే గాంచుము
తెలుగుబిడ్డ తెలియు దీని ఘనత.

అన్నృత మాడబోకు మవనిలో నీవెందు
అన్నృత మాడగలుగు నమితదుఃఖ
మన్నృత మాడనోడె నా హరిశ్చంద్రుడు
తెలుగుబిడ్డ వదలు దీని నీవు.

ఎంత చదువు చదువ నేమి లాభము భూత
దయయు సర్వసమత ధార్మికతయు
దైవభక్తి ధృతియు దాంతియు లేకున్న-
తెలుగుబిడ్డ వీని వెలుగు గనుము.

గుడిని దేవు డుండు గుడిలోని కేగిన
మనము శాంతి నంది మనగ గలము
కాన నచటి కేగి కాంచు మాదేవుని
తెలుగుబిడ్డ గుడిని వెలుగు నింపు.

గుడిని మించినట్టి బడి నేమరకు మీవు
బడిని జ్ఞానఖనిగ భావమందు
తలచినపుడె నీవు ధన్యత గాంచెదు
తెలుగుబిడ్డ గుడిని వెలుగు గొనుము.

గురుల గౌరవింపు గురువుల సేవింపు
గురువులను త్యజింప గుందు దీవు
గురుకృప గన నీవు గురువవే యగుదీవు
తెలుగుబిడ్డ గురువు వెలుగు గనుము.

గుడిని దేవు డుండు బడిలోన గురువుండు
కాన బడిని గుడినిగా దలంపు
భక్తి గురుని దైవభావన-చేసిన
తెలుగుబిడ్డ తీర్థసేవ యగును.

దీప మింటివరకె దివ్యతేజము నిచ్చు
జ్ఞానదీప మెంతొ సారవంత
మనెడు మాట నీవు మరువగ వలదోయి
తెలుగుబిడ్డ దివ్వె విలువ దెలియు.

గురువు దీప మొకటి కోరిక వెలిగించు
శిష్యహృదయమందు చేరి యద్ది
కోటి దివ్వె లగుచు కూరిమి నింపును
తెలుగుబిడ్డ తెలియు దీని వెలుగు.

బడిని దీపతతిని బాధ్యత గలిగిన
గురువులు వెలిగింత్రు కూర్మిమీర
నందు నొక్కదీప మందు నౌజ్జ్వల్యము
తెలుగుబిడ్డ దివ్వెవెలుగు గనుము.

గురువు నేర్పు మంచి గుణములనే యెందు
కాన నతని నెప్డు గారవింప
వలయు నంచు నీవు బాధ్యత నెరపుము
తెలిగుబిడ్డ గురువు విలువ నెరుగు.

గురువు తప్పు చేయ గురి వీడబోకుము
నెమ్మదిగను నతని నెమ్మనమును
మార్పుబూని నీవు మహి గను మాన్యత
తెలుగుబిడ్డ యెరుగు మిల గురువును.

# *కృతి స్వీకృతి

ఎంతటి సుప్రభాత మిది; యీవిధి మద్గురు మిత్రుఁడాదటన్
సంతసమంది తాను మదిఁ జయ్యన నెంతయొ పట్టుపట్టి మా
యంతర మంతయున్ మరచి యాంతరికం బగు ప్రేమతోడ నా
స్వాంతము సౌఖ్యముం బొరయ నంకిత మిచ్చెను నాకు నీకృతిన్.

కానికి మారబోని ననుఁ గావ్య మొసంగి ఘనంబుగాఁగ స
న్మానము చేసినాఁడు బుధమాన్యుఁడు సన్నుతశీలుఁ డైన కా
కాని నృసింహరాయ రవికాంతుఁడు నాసుకృతం బదెంతయో!
యే నిటువంటి గౌరవము నెన్నడు నందిద నంచు నాఁమదిన్
బూనఁగలేద య్యైన విధిపూనిన సత్కృతి కడ్డు లేదుగా!

ఇంత మహోత్సవంబు గన నెంతటి పుణ్యము చేసికొంటినో
పంతము పట్టి మద్గురుఁడు పట్టము గట్టెను ప్రీతితోడ నీ
వింతగు సత్కృతిం గరముఁ బ్రీతుఁడ నైతి ఫలించె మద్భవం
బింతటి మోద మందుకొన నెట్టి తపం బొనరించియుంటినో!

కవులకుఁ గీర్తికారకముగా నడపించితి గ్రంథమాల- నేఁ
గవి యని పేరు గాంతు నను కామిత మింతయు లేదు నామదిన్
భువి కవికీర్తి గాంచు తపమున్ బొనరించిన కారణమ్ముచేఁ
గవి యయినాఁడఁ గానియెడఁ; గల్గనె యిట్టిపదంబు నాకహో!

---

* "మధురకవి" శ్రీ కాకాని నరసింహారావు గారి
"ఆంధ్రభోజ" కృతిస్వీకృతి చేసినపుడు చెప్పినది.

నను శ్రీరామపదారవిందభజనానంద్త్రైకశీలున్ నృసిం
హుని ( జేరంగని నీదు కావ్యసుత - యోహో, కాని యీ సందియం
బును బాధించుచు నున్నదయ్య, యిది నా బోధల్ చెవిం బెట్టకే
యనిశంబున్ చరియించునో - చపలయై యన్నా నృసింహాభిధా!

ఇట్టి పదంబుగాంచి మది నించుక యేనియు గర్వ మూన కే
పట్టుననైక విష్ణుపదభావనమున్ బచరించుచుండు నా
పుట్టు కృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రు నృసింహరాయనిం
దొట్టి మహాకవీంద్రులకు దోసిలి యొగ్గుదు భక్తితోడుతన్.

పద్యవిద్యను నేనపండితుండను పూర్వ
పద్యానుసరణంబు పరగఁజేతు,
నష్టావధాన మన్నది యెఱుంగని దింకఁ
గష్టావధానంబు నిష్టపడుదు,
గోదాపదాసక్తిఁ గూర్మిఁ జూపను గాని
గోదాపదాసక్తిఁ గోరియుందు,
విద్యావిశారద బిరుద మందితిఁ బర
విద్యయం దాసక్తిఁ బెంపుచేయ,

నిట్టి యజ్ఞానవృద్ధు నన్నెంతొ మిత్రుఁ
డైన కాకాని కవివరుం డమిత ప్రీతిఁ
బాత్రుగా నెంచి యర్పించె భవ్యకృతిని,
ఎట్టి ధన్యతఁ గన్నాఁడ నీజగతిని!

# నివేదనము

''మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు గూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁగడంగు మాడ్కిఁబ్రౌ
ఢాంచిత శబ్దసారులు మహాకవులాద్యులు కావ్యశయ్యఁ గే
లించిన కీర్తిసంగసుఖలీలకు నేనును గాంక్ష చేసితిన్''

శంభుదాసమహాకవి సరసఫణితి
జెప్పినట్లుగ నేనును చిన్న కవిని
గాఁదలంచి వ్రాసితి నిట్లు కవిత-నాదు
చాపలము గాంచి మన్నింత్రు సారమతులు.

ఇతఁ డొక భాగ్యశాలి హృది కింపుగ సత్కృతు లల్లఁగల్గువాఁ
డతిసులభుండు సజ్జనుఁడటంచును మిత్రులు ప్రస్తుతింప నే
వెత లుడివోవగా నిటుల వేడుక నందఁగ మాత శారదాం
కితముగ గూర్చినాఁడ నిది కీర్తి సఖింగొన శ్రీనృసింహుఁడన్.

* * *

కవితాశారద యియ్యది
నవనవభావముల నొరసి నర్తన మాడన్
నవనముగ నేఁ గూర్చితి
నవగుణవిదులార! యరసి నందము గనుఁడీ.

* * *

గోదాగ్రజ, రామానుజ!
సాదరమతి నిదిగొ నిన్ను సంస్తుతి సేతున్,
వే దయఁ జూడుము-నన్నున్
వేదమయునిఁ జేర్చికొనుము పృథివిన్ ఘనతన్.

## ధర్మ కర్తలు

వసుధఁ గొండూరి తిరుమలాన్వయమునందు
నుద్భవిలె జగన్నాథ గురూ త్తముండు
చతురుఁ డుభయవేదాన్త ప్రచారకుండు
నా గురునిసతి యాండాళు నాగఁ బరగు.

ఆ మహనీయ దంపతు లహర్నిశమున్ బరమార్థ చింతయం
దే మది నిల్పి యన్యముల నేమియు గోరక యుల్లిపాలెమన్
గ్రామమునన్ బ్రతిష్ఠితునిగా నొనరించి రమామనోహరున్
దాము సమస్త మర్పణ మొనర్చిరి స్వామికి ధర్మకర్తలై.

చన నిటు గొన్ని నాళ్ళు గురుసత్తముఁ డాహరిసన్నిధానమం
దనిశము సేవఁ జేయుఁజని నంతటఁ దత్సుతుఁడౌ నృసింహఁసూ
రి నళిననేత్రుసేవ లొనరించుచు సత్కవితాపిపాసుపై
నను నియమించె నిక్కృతికి నా తొలిపున్నెపుఁ బంట పండెగా.

* * *

## అంకితము

సిరియు ధరణియు గోదయుఁ జేరికొల్వ
నుత్కటాభీష్టదాయియై యుల్లిపాలె
మందు వేంచేసియున్న నారాయణునకుఁ
బొత్త మిద్దాని సంకితమ్మును బొనర్తు.

# శ్రీ గోదాత్రింశన్మాల

శ్రీరంగరాణ్మనోహరి!
శ్రీరామానుజ సహోదరి ! శుభకరి! స
త్కారుణ్య సుధాలహరి ! త్రి
యీ రాజీవాచ్ఛ మధుకరీ! శ్రీ గోదా!

తులసీకాననమున ని
స్తులదీప్తు లెసంగఁ బుట్టి తోషితబుధుఁడై
చెలఁగెడి భట్టీశుని మన
మలరించెడి త్రిజగదంబికా ! శ్రీ గోదా!

కర్కటమునందుఁ జేరగఁ
నర్కుఁడు తొలి ఫల్గులిన్ సమస్తదురిత సం
పర్కముఁ గూల్పఁగఁ బుట్టిన
తర్కాతీత ప్రభాయుతా ! శ్రీ గోదా!

పెరియాళ్వారట వారికి
సిరియే లభింయించె నంట చెన్నుగ సుతయై
ధర నాఘను భాగ్యమ్మె
నరున కనుట నీ కతమ్మునని శ్రీ గోదా!

జానకిఁ గని జనక నృపుం
డే నినుఁ గని విష్ణుచిత్తుఁ డే పొందిరిగా
యానంద మ్మిటులటు లన
రాని విధమ్ముగను శుకకరా! శ్రీ గోదా!

సంతాన హీనుఁడగు సు
స్వాంతుఁడు భట్టేశున కిల సంతానమపై
సంతానమ్మైత్రి వాశ్రిత
సంతానమునకుఁ గృపావశా! శ్రీ గోదా!

ద్రావిడభాష కయ్యుమ్మన్
బావనతం గాంచునట్లు బాగుగఁ గోపీ
భావము మదినెంచి తిరు
ప్పావును బాడిన ఘనప్రభా! శ్రీ గోదా!

ముప్పది దినములలోనన్
ముప్పది పాశురములల్లి మురహరు మనమున్
మెప్పించినట్టి యొప్పుల
కుప్పా ! నా తప్పు లెన్నకుము శ్రీ గోదా!

మార్గళివ్రతరాజమ్ము న
నర్గళముగ నాచరించి హరికృప కిదియే
మార్గమ్మని చాటెన యప
వర్గైక ఫలప్రదానపరి! శ్రీ గోదా!

చిలుకన్ భుజమున పలుకున
పలుకునఁ దేనియల హృదయపద్మమ్మున శ్రీ
బలభద్రసహజుఁ దాల్చిన
లలనామణి ! నాదు భాగ్యలత ! శ్రీ గోదా!

పూరించితి పల విలిపు
త్తూరును ప్రేపల్లెగ నట నున్న హరినిఁ గం
సారిగఁ జెలులను గోపి
వారముగా మదిని దలఁచి వ్రతమును గోదా!

నీ దివ్య గీతికలలో
నేదో మాధుర్యమనుభవించుటచే ని
న్నే దయితగఁ జేకొనె న
త్యాదరమున రంగనాథుఁడమ్మా! గోదా!

పిన్నతనంబుననుండియు
వెన్నుని వరుగాగనెన్ని వేటెఱుఁగకయే
యున్న ప్రసన్నాకృతి! నా
పెన్నిధి! నా విన్నపములు వినుమా! గోదా!

పొందుగ భట్టేశునకన్
నందనివై రంగనాథు నారివి నై పె
ల్గొందితివి-విష్ణుచిత్తా
నందము – చేకూర్చి వరగుణా ! శ్రీ గోదా!

అమ్మా ! నా మనవిని గై
కొమ్మా! ననువేగ నేలుకొమ్మా!జ్ఞానం
బిమ్మా ! సంశ్రితమందా
రమ్మా ! నా పట్టుగొమ్మ ! రమ్మా ! గోదా !

అంగజజననీ! యా శ్రీ
రంగని కృప నాపయిన్ నిరతముం బ్రసరిం
పం గలుగునట్లు జేయుచు
నంగదలను దీర్చి ప్రోవుమమ్మా! గోదా!

"ఎన్నడి యా రదు శెయ్యా"
రన్న విధమ్ముగను దెల్పి యాశ్రితుఁడగు నా
కున్నను దోసమ్ములు హరి
మన్నించెడి రీతిఁ జేయుమా! శ్రీ గోదా!

రంగద్రంగేశ్వర హృద
యంగమ దరహసితశోభితానన! కరుణో
త్తుంగాతరంగ! మంగళ
సంగా! అఘభంగ! క్షోణిజా! శ్రీ గోదా!

వందారుబృందమందిర
మందారమ! దివ్యగాన మకరందఝరీ
కందళితానంద మురా
రిందిందిర! యిందిరా! మహీ! శ్రీ గోదా!

మాధుర్యధుర్యమాధవ
గాధత్వవబోధనైక కాంక్షిణి! విధుతా
బోధా! సాధ్వీలోక
ప్రాధాన్యయశోధరా! ధరజా! గోదా!

లీలామానుష విగ్రహి
ణీ ! లావణ్యస్వరూపిణీ ! పంకజ పా
ణీ ! లాలితదాసశ్రే
ణీ ! లలనాతతి శిరోమణి ! శ్రీ గోదా !

మాణిక్యభూషణాంచిత
వేణీ ! యేణాక్షి ! శోణబింబాధరి ! మ
త్ప్రాణత్రాణకరీ ! ని
ర్వాణసుఖవిధాత్రి ! మధుర వాణీ ! గోదా !

పన్నిద్దఱు సూరులలో
మిన్నుగ నెన్నికను గన్న మేటి సుగుణసం
పన్నవు తెన్నెఱఁగఁ గుమా
రు న్ననుఁ బాలింపు మమ్మరో ! శ్రీ గోదా!

ఘోర భవాంబుధిఁ దిన్నం
దీరును గనలేక మున్గితేలెడి నరులన్
శౌరి దయ జూడఁగఁ బురుష
కారమొనర్చెడి మదంబికా ! శ్రీ గోదా !

తమిచే భక్తిని శృంగా
రముతో జోడించి రంగరమణుని సాయు
జ్యముఁ జూఱగొన్న గీర్వా
ణి ! మరాళమదేభగామినీ ! శ్రీ గోదా !

నీ విడిచిన సుమమాలిక
లావటదళశాయికిం బ్రియములై యా మో

దావహములు నైనవి కద
భావింపఁగరాదు నీదు భాగ్యము గోదా!

ఔదలఁ దాల్చెద నీ మృదు
పాదమ్ములు విహితభక్త పాపప్రతతి
చ్ఛేదమ్ములు శ్రీదమ్ములు
మోద మ్మలరారఁ జెంతఁ బొల్చుము గోదా!

భీతికరమ్మగు సంసృతి
వాతంబడి మ్రగ్గియున్న వాఁడను త్రిజగ
న్మాతవు కాదా? నాకిఁకఁ
జైతన్యస్తన్య మొసఁగి సాకుము గోదా!

తల్లీ ! శ్రితజన కల్పక
వల్లీ ! మామకమనోబ్జవాసిని ! నా పైఁ
జల్లని చూడ్కులు బరపుచు
నుల్లాసముఁ గూర్ప వేడుచుంటిని గోదా !

కందమ్ము లల్లి నీయడు
గుందమ్ముల పూజ సల్పుకొంటిని నాకున్
బందమ్ములు వాపుటకై
డెందమ్మున జాలిఁ బూనలేవా? గోదా !

ఇది గోదాత్రింశన్మాల దీనిఁపఠియించు వారలకు సర్వ శుభాభ్యు
దయము లొసఁగూడుచు నాది దంపతుల దివ్యకరుణ తిరమ్మై వరలున్.

T.T.D. Religious Publications Series No : 694
Price : Rs. 5/-

Printed and Published by Sri A.P.V.N. Sarma, I.A.S., Executive officer, T.T. Devasthanams and Printed at TTD Press, Tirupati.